

Sunday SPECIAL

మట్టి గణపతికి జైహో..




- మట్టి వినాయక విగ్రహాల వైపు జనం ఆసక్తి
- నవరాత్రి ఉత్సవాల్లో కొలువుదీరనున్న మట్టి గణపతులు
- 'ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు'కి పెరుగుతున్న ఆదరణ
- నగరంలో పెద్దఎత్తున విగ్రహాల తయారీ
- అందుబాటు ధరల్లో అన్ని చోట్ల అమ్మకానికి సిద్ధం
- ఎల్లమ్మబజార్‌లో తొలిసారి 40 అడుగుల భారీ మట్టి విగ్రహం

5

వరంగల్ ఎల్లమ్మబజార్‌లో తొలిసారిగా రూపుదిద్దుకుంటున్న 40 అడుగుల భారీ మట్టి విగ్రహం





నవరాత్రుల సందడి ప్రారంభం కాబోతోంది. తొమ్మిది రోజులు పూజలు, భజనలు, ప్రసాదాలు, అన్నదానాలతో ప్రతీ వాడ, పల్లె అధ్యాత్మిక శోభ సంతరించుకోనున్నది. ఈ క్రమంలో మట్టి విగ్రహాలను వినియోగించుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు హాని కలిగిస్తున్న నేపథ్యంలో 'ఎకో ఫ్రెండ్లీ గణపయ్య'ను ప్రతిష్ఠించుకోవాలని కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా నగరంలో పెద్దఎత్తున మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. వివిధ ఆకృతులు, రంగులతో ఆకర్షణీయంగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇందుకోసం పల్లెల్లో పొలాల్లోని మట్టిని, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచు, కర్రలను ఉపయోగించి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కాగా, నగరంలోని ఎల్లమ్మబజార్‌లో 40 అడుగుల అతిపెద్ద మట్టి విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తర్వాత వరంగల్‌లో పెద్దదైన విగ్రహం ఏర్పాటు చేయనుండడం గమనార్హం.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)



తొర్రూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న వర్షం నీరు



గార్ల సమీపంలోని రాంపురం చెక్‌డ్యాంపై నుంచి పొంగిపొర్లుతున్న పాకాలవాగు

- జిల్లాలో పొంగుతున్న వాగులు
- పలుచోట్ల రాకపోకలు బంద్
- నీటమునిగిన పంటలు

దంచికొట్టిన వాన



దోర్నకల్ మున్నేరులోకి చేరిన వరదనీరు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 31 : జిల్లాలో వర్షాలు దంచికొడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ఏకధాటిగా కురిసిన వాన.. శనివారం ఉదయం భారీ వర్షంగా మారి దంచికొట్టింది. పలు మండలాల్లో భారీ వర్షం కురియగా, మరికొన్ని ఓ మోస్తారు వర్షం కురిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు లు పొంగి ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. తొర్రూరు మండలం కంఠాయపాలెం చెరువు అలుగుపోయడంతో గుర్తూర్- కంఠాయపాలెం, తొర్రూరు మధ్య రాకపోకలు బంద్, వెంకటాపురం గ్రామ శివారులోని కుంట పొంగడంతో వెంకటాపురం-హరిపిరాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. గార్లలోని రాంపురం చెక్‌డ్యాంపై పాకాలవాగు పొంతుండడంతో పలుగ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కొత్తగూడ మండలంలో మొద్రాయిగూడెం వాగుతో పాటు పలువాగులు పొంగి పోర్లుతున్నాయి. భారీ వర్షాలతో వరదనీటి తాకిడితో చెరువులు మత్తడిపోస్తున్నాయి. నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి శివారు భారీ వర్షాలతో వరి చేలపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో కొంత భాగం పొలం కొట్టుకుపోయింది. మిర్చి తోటలు మునిగిపోయాయి. ఆకేరువాగుపొంగి ప్రవహిస్తోంది. బలమైన గాలులు వీస్తుండడంతో దంతాలపల్లి మండలంలో భారీవృక్షం రోడ్డుపై కూలింది. దీంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జిల్లాలో ఇలా..

మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నెల్లికుదురు శివారు, మేచరాజుపల్లి శివారులో భారీ వర్షం కురియడంతో వరదలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లైన్‌తండా మీదుగా వరద ప్రవహిస్తుండంతో తండా సమీపంలోని వరిపొలాల నుంచి భారీగా వరదనీరు ప్రవహిస్తుండడంతో కొంతపొలాలు కొట్టుకుపోయాయి. నెల్లికుదురులోని ఆకేరువాగు పొంగిపోర్లుతుంది. తొర్రూరు పట్టణం రెండు గంటలపాటు భారీ వర్షం కురియడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పద్మశాలి బజారులో 20 ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శివాలయంలోకి నీరు ప్రవేశించింది. తొర్రూరు మండలం కంఠాయ పాలెం చెరువు అలుగుపోయడంతో గుర్తూర్-కంఠాయపాలెం, తొర్రూరు మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. వెంకటాపురం గ్రామ శివారులోని కుంట పొంగడంతో వెంకటాపురం-హరిపిరాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై జి.ఉపేందర్ సిబ్బందితో వాగుదాటకుంట చర్యలు తీసుకున్నారు. మండలంలో 20 చెరువులు అలుగులు పోస్తున్నాయి.



నెల్లికుదురు మండలం మేచరాజుపల్లిలో వర్షపు నీటితో మునిగిన పంట పొలాలు

గూడూరు మండలంలో పాకాల వాగు ఉప్పొంగుతోంది. గూడూరు-నెక్కొండ రోడ్డు పెట్రోల్ పంపు వద్ద ఓ చెట్టు కూలిపోయింది. రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దొరవారి తిమ్మాపురం సమీపంలోని వాగు పొంగిపొర్లుతుండడంతో మట్టేవాడ-దొరవారితి మ్మాపురం మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గూడూరు పాకాల వాగును ఎస్సై గిరిధర్‌రెడ్డి సందర్శించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి రాకపోకలు నిలిపివేశారు. గార్లలోని రాంపురం చెక్‌డ్యామ్‌పై నుంచి ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుండడంతో రాంపురం, మద్దివంచతో పాటు మరో 9 గ్రామా లకు రాకపోకలు బంద్ అయ్యాయి. కేసముద్రం మండలం అర్పనపల్లి సమీపంలోని పాకలవాగు బ్రిడ్జికి అనుకుని ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాత్రి వరకు బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించే అవకాశం ఉంది.

కేసముద్రం-గూడూరు-కాట్రపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. కేసముద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. కొత్తగూడ మండలంలోని మొద్రాయిగూడెం లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బూర్కపల్లి, కత్తెర్ల వాగు, ముస్మివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెద్దవంగర మండలంలో

మిగతా 6వ పేజీలో..

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీవర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పోలీస్, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూశాఖ అధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 51 వరద ప్రభావిత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఆప్రాంతాల్లో చెరువులు, కుంటలు, వాగులవద్ద తగిన జాగ్రత్తలు తీసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌సెల్ నెంబరు : 79950 74803 ఏర్పాటు చేశామన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలుసిబ్బంది అందుబాటులో ఉంటారని, భారీ వర్షాలతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా సంప్రదించాలని కోరారు. నిత్యం ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్ అన్నివిభాగాల సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేసి వర్షాలతో ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవాలని సూచించారు.

ఏపీ సీఎంను కలిసిన బండి పుల్లయ్య



ఏపీని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు,ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును శుక్రవారం రాత్రిఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు, టీడీపీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. టీడీపీని బలోపేతం చేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, అందుకు కార్యకర్తలను సన్నద్ధం చేయాలని చంద్రబాబు సూచించినట్లు బండి పుల్లయ్య తెలిపారు.

పేలిన ఫాగింగ్ మిషన్

- తప్పిన ప్రమాదం

నెల్లికుదురు, ఆగస్టు 31 : మండలంలోని రాజులకొత్తపల్లిలో గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న క్రమంలో ఫాగింగ్‌మిషన్ పేలింది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామపంచాయతీ సిబ్బంది తూళ్ల ఎల్లయ్య, ఎండీ సుభాన్ మిషన్‌తో ఫాగింగ్ చేస్తున్న క్రమంలో మిషన్ల నుంచి ఒకేసారి మంటలు వచ్చాయి. వెంటనే మిషన్‌ను కింద పడేయడంతో పేలింది. సిబ్బంది దూరంగా వెళ్లిపోయారు. మిషన్ మంటల్లో దగ్ధమైంది. దీంతో పెను ప్రమాదం తప్పింది. మరమతులు చేయని పాత మిషన్‌లతో ఫాగింగ్ చేయవలసి వస్తుందని, వాటిని వాడుతున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కొత్తమిషన్లు ఏర్పాటు చేయాలని సిబ్బంది అధికారులను కోరారు.

నెరవేరిన 'పీహెచ్‌డీ' కల

- ఎట్టకేలకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు
- అన్ని విభాగాల్లోనూ విద్యార్థుల జాయినింగ్
- ఆనందోత్సాహాల్లో అభ్యర్థులు

5

మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 31 : మార్కెట్ కమిటీ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మార్కెట్ కమిటీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వరంగల్, జనగామ, జమ్మికుంట, ఖమ్మం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి లక్ష్మీబాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ ఫీజు పెండింగ్ లేకుండా వసూలు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో కె.సురేఖ, ఏనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, జన్ను భాస్కర్, లాషరీఫ్, పి.అశోక్ పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ ఉత్స వాలు, నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో శనివారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న వినాయకచవితి పండుగను పురస్కరించుకుని, గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం విగ్రహాలను ఏర్పాటు చేసేం దుకు పోలీస్, విద్యుత్‌శాఖల నుంచి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంతరాలు వాటిల్లకుండా ఉత్సవ కమిటీ నిర్వహకులు బాధ్యత వహించి వలంటీర్లను నియమించుకోవాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

నీటి పారుదలశాఖ అధికారులు చెరువులు, కాల్వల వద్ద సిబ్బందికి విధులు కేటాయిం చాలన్నారు. నిమజ్జనంలో గజ ఈతగాళ్లను మాత్రమే నియమించాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. పోలీస్‌శాఖ క్రేన్‌తోనే విగ్రహాలను నిమజ్జనం చేయించాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాఖ అధికారులు శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వినాయక ఉత్సవాల భద్రతకు సంబంధించి పోలీస్, మునిసిపల్, అగ్నిమాపక, నీటిపారుదల, వైద్య, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులు సిబ్బందితో సమన్వ యంగా పని చేస్తూ శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా చూడాలన్నారు.

సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం.డెవిడ్, ఏఎస్పీ చెన్నయ్య, ఆర్డీవోలు నర్సింహారావు, అలివేలు, జిల్లా అధికారులు మధుసూదనరాజు, నర్మద, హరిప్రసాద్, కిరణ్, భీమ్లానాయక్, సమ్మిరెడ్డి, డాక్టర్ మురళీధర్, నోముల రవీందర్, శాంతికుమార్, వెంకటస్వామి, నరేష్ రెడ్డి, మదన్‌మోహన్, పవన్‌కుమార్, భద్రకాళి తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధి ఏది?

తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హన్మంతు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31 : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏడు సంవత్సరాలు గడిచినా.. సంచార జాతుల అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమేనని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుంజె హన్మంతు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు బీటీఆర్ నగర్‌లోని వడ్డెర కాలనీలో తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శనివారం సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. శ్రమశక్తిని నమ్ముకుని జీవించే సంచార జాతులు ఎక్కడ పని దొరికితే అక్కడకు వెళ్తూ సంచార జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. 1967 ఆగస్టు 30న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వడ్డెర కులస్తులను బీసీ-ఏ జాబితాలో చేర్చి, తోటి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి తమకు అన్యాయం చేశారని వాపోయారు. వడ్డెర కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే ఎస్టీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వడ్డెరల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి పెద్దఎత్తున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంపంగి రాంచంద్రు, ప్రధాన కార్యదర్శి అలకుంట్ల వెంకటేష్, పల్లపు రాందాస్, అలకుంట్ల శ్రీనివాస్, రాములు, ఎల్లయ్య, వెంకటమల్లు, వెంకన్న, మల్లేష్, చిరంజీవి, మల్లికాంబ, ఐలయ్య, రాజు పాల్గొన్నారు.



మానుకోటలో వడ్డెర ఆత్మగౌరవ జెండాను ఆవిష్కరిస్తున్న గుంజె హన్మంతు



పీడిత ప్రజలే గద్దర్ వారసులు

గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి సూర్యకిరణ్

వడ్డెపల్లి, ఆగస్టు 31: దేశ పీడిత ప్రజల విముక్తి కోసం తుది వరకు పోరాడిన ప్రజా యుద్ధ నౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్‌కు నిజమైన వారసులవుతారని గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్ అన్నారు. గద్దరన్న విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ జిల్లా చైర్మన్ కోండ్ర నర్సింగరావు అధ్యక్షతన శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన గద్దర్ ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి త్యాగపూరిత పోరాటం చేసిన గద్దర్ విగ్రహాలను, స్మృతి వనాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గద్దరన్న స్ఫూర్తితో చెట్టు, పుట్టతో మమేకమై జీవిస్తున్న ఆదివాసీల రక్షణ కోసం, అణగారిన ప్రజల హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు.

తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. గద్దరన్న ప్రతీ మాటలో, ప్రతీ అడుగులో, ప్రతీ పాటలో పీడిత ప్రజల విముక్తి కోసం సందేశం ఉండేదని చెప్పారు. త్యాగానికి ప్రతిరూపమైన గద్దరన్న తన భార్యా, బిడ్డ, కొడుకు కోసం ఆలోచన చేయకుండా ప్రజల కోసమే పనిచేసి అమరజీవిగా నిలిచి పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రజా సంఘాల జేఏసీరాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. పుట్టుక, చావు తనది, బతుకంతా ప్రజల పక్షాన నిలబడి, కలబడి పోరాటం చేసిన గద్దర్ జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని ఆయన పేరిట స్మృతి వనాలను ఏర్పాటు చేయాలని కోరారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో గద్దర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి గద్దర్ కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ గద్దరన్నను, గద్దర్ చరిత్రను చంపాలని, రూపు మాపాలని చూస్తున్నారని, ఏ పార్టీ కోసం ఆయన తన సర్వస్వాన్ని త్యాగం చేశాడో ఆ పార్టీ నేడు గద్దర్‌ను స్మరించుకోవడం లేదని విమర్శించారు. ఈ సభలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నేత సాయిని నరేందర్, గద్దర్ కోడలు సరిత, గద్దర్ సహచరుడు సీఎల్. యాదగిరి, వివిధ ప్రజా సంఘాల నాయకులు సుంకరి భిక్షపతి, గాజాల గోవర్ధన్, పటేల్ వనజక్క, సోమా రామమూర్తి, కూనూరు రంజిత్‌గౌడ్, చుంచు రాజేందర్, కరేటి శంకర్ రావు యాదవ్, వెంగ శిరెడ్డి, రామబ్రహ్మం, నున్న అప్పారావు, తాడిశెట్టి క్రాంతికుమార్, కేడెల ప్రసాద్, మన్నె బాబురావు, బండి మొగిలి, రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న గుమ్మడి సూర్యకిరణ్, వేదికపై ప్రొఫెసర్ వెంకటనారాయణ, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, డాక్టర్ పృథ్వీరాజ్

కాజీపేట మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు

కాజీపేట, ఆగస్టు 31: కాజీపేట - హసన్‌పర్తి మధ్య రైల్వే నాలుగో రైల్వే ట్రాక్ నిర్మాణాల నేపథ్యంలో సెప్టెంబర్ 23 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ రైలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబరు 8 వరకు, సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2 వరకు, గుంటూరు - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2 వరకు, విజయవాడ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 7 వరకు రద్దు చేశారు. కాజీపేట - సిర్పూర్ టౌన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 8 వరకు, బల్లార్ష - భద్రాచలం రోడ్‌ల మధ్య నడిచే సింగరేణి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ రైలు సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 8 వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నారని చెప్పారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య




కాజీపేట బాలవికాసలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కాజీపేట, ఆగస్టు 31: సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్. తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మాదిగలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కాజీపేట బాలవికాస సెంటర్‌లో శనివారం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యస్థాపకుడు మైసా ఉపేందర్ అధ్యక్షత మాదిగ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మాజీ జడ్పీ చైర్మన్ డాక్టర్. ఎం.సుధీర్‌కుమార్‌లు హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా మాదిగలు అన్నిరంగాల్లో తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మాదిగల రిజర్వేషన్‌ల కోసం మాదిగ సంఘాలు చేసిన ఉద్యమాలతోనే సుప్రీంకోర్టు అనుకూల తీర్పుఇచ్చిందన్నారు. రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు మాదిగలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు బొట్ల భిక్షపతి మాదిగ, నాయకులు జనగాం నర్సింగ్, గోవింద్, నవీన్ కు మార్, వీరస్వామి, బండ శ్రీనివాస్, జన్ను మధు, గంగారపు అమృతరావు, ఆరూరి రంజిత్, పరం జ్యోతితోపాటు మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.














రుద్రేశ్వరాలయంలో సినిమా యూనిట్ పూజలు

వేయిస్తంభాల ఆలయంలో సినిమా షూటింగ్

సందడి చేసిన హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 31: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సినిమా షూటింగ్ ప్రారంభమైంది. సుమారు దశాబ్దకాలం తరువాత వేయిస్తంభాల కల్యాణ మండప పనులు పూర్తయిన నేపథ్యంలో చాలా కాలం చిత్రీకరణ సందడి మొదలైంది. వరంగల్‌కు చెందిన ప్రముఖ నిర్మాత మధుర శ్రీధర్.. మాధవి ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' షూటింగ్ తొలి షెడ్యూల్ వేయిస్తంభాల ఆలయంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా ఐదు గంటలపాటు కొనసాగింది. దర్శకుడిగా సంజీవ్ వ్యవహరిస్తున్న ఈ సినిమాలో హీరోగా విక్రాంత్, హీరోయిన్‌గా చాందినీ చౌదరి నటిస్తున్నారు. హీరోయిన్ తండ్రిగా బలగం ఫేం మురళీధర్‌గౌడ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రేమ ప్రధానంగా, సెంటిమెంట్‌తోపాటు సమాజానికి మంచి సందేశాన్ని అందించే సినిమాను నిర్మిస్తున్నట్లు మధుర శ్రీధర్ చెప్పారు. హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని, తండ్రి పాత్రలపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు ఆలయంలోని రుద్రేశ్వరుడికి సినిమా యూనిట్ ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ సినిమా యూనిట్‌ను సాదరంగా స్వాగతించి పూజలు నిర్వహింపజేసిన అనంతరం ఈ సినిమా విజయవంతం కావాలని ఆశీర్వదించారు. మరో మూడు రోజులుపాటు షూటింగ్ నిర్వహిస్తామని శ్రీధర్ తెలిపారు.


షూటింగ్‌లో హీరో, హీరోయిన్

మట్టి గణపతికి జయహో

● మట్టి వినాయక విగ్రహాల వైపు జనం చూపు ● నగరంలో పెద్దఎత్తున విగ్రహాల తయారీ



హనుమకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ వస్తోంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి. ప్రతీ వీధిలో గణేషుడు కొలువుదీరనున్నాడు. ఈ నేపథ్యంలో చాలా మంది ఎకో ఫ్రెండ్లీ గణేషుడిని పూజించేందుకు మక్కువ చూపుతున్నారు. అనేక గణేష్ మండపాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఇష్టపడుతున్నారు. ఇదివరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా పూజించేవారు. చూడటానికి ఇవి ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో చాలామంది వీటినే ప్రతిష్ఠించడానికి ఆసక్తికనబరిచేవారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అందమైన విగ్రహాలను తయారు చేసి వాటికి వివిధ రంగులను జోడించి తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసిన సమయంలో అవి విషపూరితమైన కెమికల్స్‌ను విడుదల చేయడంవల్ల పర్యావరణానికి హానికలిగేది. అయితే కరోనా మహమ్మారి తర్వాత 'గో గ్రీన్.. సేవ్ లైఫ్' పేరుతో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను తయారు చేయడం.. మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించడం వంటివి మొదలుపెట్టారు. ప్రస్తుతం వాటినే ట్రెండ్‌గా సెట్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఎక్కువమంది మట్టి వినాక విగ్రహాలను పూజించేందుకు, భక్త మండళ్లు వాటినే ప్రతిష్ఠించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో మట్టి విగ్రహాలకు క్రమంగా డిమాండ్ పెరగడంతో తయారీదారులు పీవోసీ నుంచి మట్టివిగ్రహాల వైపు మళ్లుతున్నారు. ఆ మేరకు పీవోసీ విగ్రహాలతో పోటీపడేలా అంతకన్నా అందంగా ఉండేలా మట్టిగణపతులను రూపొందించి మార్కెట్‌లో విక్రయానికి పెడుతున్నారు.

జోరుగా మట్టి విగ్రహాల తయారీ

ప్రస్తుతం వరంగల్ నగరంలో పలు చోట్ల రోడ్ల పక్కన అమ్మకానికి పెట్టిన గణనాథుల విగ్రహాల్లో మట్టి విగ్రహాలే ఎక్కువగా ఉన్నాయి. పీవోసీ కన్నా మట్టి విగ్రహాలను తయారు చేయడం కొంచెం కష్టమే. అయితే పీవోసీ విగ్రహాల తయారీకయ్యే ఖర్చుతో పోల్చితే కొంత మేరకు చౌకనే. పైగా విగ్రహాల తయారీలో ఉపయోగించే ముడిసరుకు స్థానికంగానే దొరుకుతుంది. కాస్త నైపుణ్యం, సృజనాత్మకతను జోడిస్తే మట్టి విగ్రహాలను మరింత అందంగా తయారు చేయవచ్చునని చెబుతున్నారు విగ్రహ తయారీదారులు. మట్టి విగ్రహాలను పూజించాలన్నదే హిందూ సంప్రదాయం. ధార్మిక సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఇటీవలకాలంలో దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం కూడా మట్టి వినాయకులపై ఆదరణ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు చాలా మంది తయారీదారులు మట్టివిగ్రహాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మట్టి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది.

పెద్ద ఎత్తున ఆదరణ

వినాయక చవితి పండుగకు నెల రోజుల ముందుగానే చాలామంది మట్టి విగ్రహాల తయారీకి ఆర్డర్స్ ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు. బిహార్, కోల్‌కత్తా, మహారాష్ట్ర నుంచి వల వచ్చిన కుటుంబాలు ఇప్పటికీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను తయారు చేస్తుండగా.. స్థానికులు మాత్రం మట్టి విగ్రహాలను రూపొందిస్తున్నారు. వినాయక చవితికి ఇంకా ఏడు రోజులే మిగిలి ఉండడంతో క్షణం తీరిక లేకుండా రాత్రింబవళ్లు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వీటి ధరలు కూడా విగ్రహం ఎత్తును బట్టి రూ 2వేల నుంచి రూ.20వేల వరకు ఉన్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కన్నా ఒకింత తక్కువగానే ఉన్నాయి. అయితే పీవోపీ విగ్రహాల అంత ఎత్తు, ఆ రకమైన డిజైన్లలో వీటిని చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం వాటి బరువు పెరగడం, ఖర్చు కూడా అధికం కావడం.

11 ఏళ్లుగా తయారీలో..



మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయడం ఒక కుటీర పరిశ్రమలా గొట్టే శివకుమార్ కొనసాగిస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆయన 11 ఏళ్ల మట్టి విగ్రహాలనే తయారు చేసి అమ్ముతున్నాడు. విగ్రహాల తయారీకి పొలాల్లోని బంకమట్టినే వాడుతున్నాడు. ఆ మట్టిలో రాళ్లులేకుండా శుభ్రం చేసి అందులో కొంత ఇసుక కలిపి, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచుతో వీటిని తయారు చేస్తున్నాడు. విగ్రహం పటిష్ఠంగా ఉండడానికి వాటి తయారీలో స్థానికంగా దొరికే కర్రలను వినియోగిస్తున్నాడు. మట్టి విగ్రహాల తయారీ వల్ల స్థానిక మహిళలకు కూలీ దొరుకుతోంది. సుమారు 30 నుంచి 40 మంది మహిళలు వీటి తయారీలో పాలుపంచుకుంటున్నారు. వారికి రోజువారీ కూలీ చెల్లిస్తున్నాడు. జూన్ నుంచి ఆగస్టు వరకు నాలుగు నెలల పాటు వారికి చేతినిండా పని ఉంటుందని శివకుమార్ చెబుతున్నాడు. మూడు నుంచి తొమ్మిది అడుగుల ఎత్తు వరకు ఉండే ఈ విగ్రహాలను ఏటా సుమారు 150 వరకు తయారు చేసి వరంగల్ నగరంతో పాటు హైదరాబాద్ తదితర పట్టణాల్లో విక్రయిస్తున్నాడు. పీవోపీ విగ్రహాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో అత్యంత అందమైన రీతిలో వీటిని తయారు చేస్తున్నారు. విగ్రహాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వాటిని ప్రకృతిలో లభించే రంగులతోనే తీర్చిదిద్దడంతో పాటు వాటిని స్థానిక మహిళలు రూపొందించి ఎంబ్రాయిడరీ వస్త్రాలతో అలంకరించడంతో అవి మరింత అందంగా, సహసిద్ధమైన సౌందర్యంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఇవి హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ వద్దనే కాకుండా పలు ఇతర చోట్ల అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.

ఆసక్తి చూపుతున్నారు..

మురావత్ విజయకుమార్, సేల్స్‌మన్



ఏటా 150కిపైగా మట్టి విగ్రహాలను విక్రయిస్తుంటాం. మార్కెట్‌లో ట్రెండ్‌ను బట్టి సరికొత్త డిజైన్లతో రూపొందిస్తున్నాం. పూర్తిగా మట్టితో సహజసిద్ధమైన రంగులతో తయారుచేసిన ఈ విగ్రహాలను కొనుగోలు చేయడానికి యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పండగ నాటికి దాదాపు అన్ని విగ్రహాలు అమ్మకమవుతాయి. ధరలు విగ్రహం ఎత్తును బట్టి రూ.6వేల నుంచి రూ.22వేల వరకు ఉన్నాయి. విగ్రహం తేలిగ్గా ఉంటుంది. ఇద్దరు మనుషులు సునాయాసంగా మోసుకెళ్లవచ్చు.

40 అడుగుల భారీ మట్టి గణనాథుడు

వరంగల్ నగరంలో తొలిసారి 40 అడుగుల ఎత్తు భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. వరంగల్‌లోని ఎల్లమ్మబజార్‌లో మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం తయారీ దాదాపు పూర్తయింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తర్వాత అతి పెద్ద వినాయక విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించనున్నారు. శ్రీ భద్రకాళి హిందూ ఉత్సవ నిర్వహణ సమితి ఆధ్వర్యంలో ఆకుతోట సంజు సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. కమలంపై నిల్చున్న భంగిమలో ఉన్న దుర్గ గణపతి ఎంతో గంభీరంగా, అందంగా ఆకట్టుకునే రీతిలో దర్శనమియ్యనున్నారు. వినాయక చవితి రోజు భద్రకాళి ఆలయం ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు తొలిపూజ నిర్వహిస్తారు. నవరాత్రులు ఉదయం, సాయంత్రం నిత్యవిధి పూజలు, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు పూర్ణాహుతి ఉంటుంది. ఈ భారీ వినాయకుని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా గట్టిగట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు చెందిన 30 మంది సెక్యూరిటీ గార్డులు రేయింబవళ్లు ఇక్కడ కాపలాగా ఉంటారు. సమితి నిర్వాహకులు శనివారం సీపీని కలిసి పోలీసు బందోబస్తును కూడా కోరారు. నవరాత్రులు ముగిసిన తర్వాత ఉన్నచోటనే విగ్రహ నిమజ్జనం నిర్వహిస్తారు. ఫైర్ ఇంజన్ సాయంతో పాలునీళ్లతో అభిషేకిస్తారు. దీంతో విగ్రహం క్రమంగా కరిగిపోయి ఉన్నచోట నిమజ్జనం అవుతుంది.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించేందుకే..

ఆకుతోట సంజు, ఎల్లమ్మబజార్, వరంగల్

ఖైరాతాబాద్‌లో భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించడం చూసిన తర్వాత వరంగల్‌లో కూడా అదే రీతిలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. పర్యావరణ పరిరక్షణ అంటే నాకు ఎంతో మక్కువ. ప్లాస్టర్ పారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టం ఎంతో కలిచివేసింది. ఇందుకు మట్టితో చేసి విగ్రహాలనే పూజించాలనే ఉద్దేశంతో వరంగల్‌లో భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటుకు సంకల్పించాను. నా స్వస్థలం ఎల్లమ్మబజార్‌లో భారీ గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. 3 నెలల కిందట విగ్రహం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. విగ్రహాన్ని ఉన్నచోటనే రాగడి మట్టి, గడ్డి, ఉనుక, కర్రలతో రూపొందిస్తున్నాం. సహజ సిద్ధంగా లభించే రంగులనే వాడుతున్నాం.

నెరవేరిన 'పీహెచ్‌డీ' కల

కేయూ క్యాంపస్, ఆగస్టు 31: ఎన్నో అవాంతరాలు, ఆటుపోట్లు, పోలీసు కేసులు, విద్యార్థులపై లాఠీ చార్జీలు, నిర్బంధాలను తట్టుకుని విద్యార్థులు చేసిన పీహెచ్‌డీ అడ్మిషన్ల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు కాకతీయ యూనివర్సిటీలో శనివారం అన్ని విభాగాలో పీహెచ్‌డీ అభ్యర్థుల అడ్మిషన్ల ప్రక్రియ సాఫీగా సాగింది. వర్సిటీలోని అన్ని విభాగాల్లో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు.. వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో తమ జాయినింగ్ రిపోర్టులను అందచేసి ధృవపత్రాలను పొందారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందడంతో అభ్యర్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

అలుపెరుగని పోరాటం

పీహెచ్‌డీ కేటగిరి-1, 2లలో సరైన నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ గతంలో కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎదుట పీహెచ్‌డీ ఆశావహులందరూ నిరవధిక నిరసనలు చేపట్టారు. అదే క్రమంలో అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు విద్యార్థుల దీక్షలను పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విద్యార్థుల పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారం అప్పట్లో రాష్ట్ర స్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు విద్యార్థులకు అండగా నిలిచారు. వర్సిటీలో విద్యార్థులు చేసిన పోరాటానికి స్పందించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు చిరకాలవాంఛ అయిన పీహెచ్‌డీ అడ్మిషన్లను ఇప్పుడు కల్పించారు. ఇందుకు రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులకు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు జోక్యంతో అప్రమత్తంగా..

రాష్ట్ర హైకోర్టులో పీహెచ్‌డీ అడ్మిషన్లపై పిల్‌ను కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి దాఖలు చేశారు. పిల్ తీర్పు రాకముందే వర్సిటీ ఉన్నతాధికారులు అప్రమత్తమై న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తతో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. భవిష్యత్తులో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా అడ్మిషన్లు పూర్తి చేశారు. అయితే హైకోర్టు దాఖలు చేసిన పిల్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన పీహెచ్‌డీ అడ్మిషన్ల వరకే వర్తిస్తుందని తెలుస్తోంది. మిగతా విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులను పిల్‌లో ఇంప్లీడ్ చేయలేదని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూ సోషల్ సైన్స్ విభాగంలో అత్యధికంగా 140 మందికి అడ్మిషన్లు కల్పించారు. వీరిలో ఎకనామిక్స్‌లో-7, హిస్టరీలో-21, టూరిజంలో-13, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో-22, హెచ్‌ఆర్ఎంలో-24, రాజనీతిశాస్త్రంలో- 32, సోషియాలజీలో- 12, సోషల్ వర్క్స్‌లో 14 మంది అభ్యర్థులు అడ్మిషన్లు పొందారు. అలాగే న్యాయశాస్త్రంలో 6, ఆర్ట్స్ విభాగంలో ఇంగ్లీష్‌లో-3, ఫార్మసీ విభాగంలో- 15, ఇంజనీరింగ్ విభాగంలోని ఈసీఈలో-7, సివిల్‌లో-1, మెకానికల్‌లో-1 చొప్పున అభ్యర్థులు అడ్మిషన్లు పొందారు. వీటితో పాటు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 15, లైఫ్‌సైన్స్ విభాగాల్లోనూ అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించారు.

వర్సిటీ భూమి కోసం పోరాటం

తీవ్ర చర్చనీయాంశంగా 'ఆంధ్రజ్యోతి' కథనం ● కదన రంగంలోకి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 31: కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూ వివాదాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి దక్కించుకోవాలని వర్సిటీ ఉద్యోగ, విద్యార్థి, మేధావి వర్గాలు భావిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రచ్చకెక్కుతున్న కేయూ భూ వివాదం 'కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. 1989లో అప్పటి తాత్కాలిక అవసరాల కోసం వర్సిటీ అధికారులను ఒప్పించి పోలీసు ట్రైనింగ్ కోసం 2 ఎకరాల స్థలాన్ని జిల్లా పోలీసుశాఖకు మాట మీద ఉచితంగా అప్పగించారు. అదే అదునుగా భావించిన పోలీసు అధికారులు వర్సిటీ భూముల్లో క్రమ క్రమంగా పాగా వేశారు. సీఆర్‌పీఎఫ్ క్యాంపుతో పాటు కేయూ పోలీస్‌స్టేషన్, జిల్లా పోలీసు అధికారుల ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. అంతటితో ఆగకుండా పోలీస్ ట్రైనింగ్ అవసరాల కోసమంటూ మరో 7ఎకరాల వర్సిటీ భూమికి కంచె వేశారు. వర్సిటీ అధికారులు వర్సిటీ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తామంటే తమకు ప్రత్యేకంగా గేటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసలే వర్సిటీ భూమి అన్యాక్రాంతమవుతోందని విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. సందెట్లో సడేమియా అన్నట్లు పోలీసు అధికారులు అందినకాడికి వర్సిటీ భూములను గుట్టుచప్పుడు కాకుండా చక్కబెట్టుకునే ప్రయత్నాలకు దిగారు. దీన్ని గుర్తించిన వర్సిటీ ఉన్నతాధికారులు పోలీసులకు అసలు ఎంత భూమి కేటాయించారు? అది ఏ ప్రతిపాదికన ఇచ్చారనే విషయంపై దృష్టి సారించారు. అదే విషయాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లగా, సీఎం రేవంత్‌తో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహాయంతో తిరిగి భూమిని తప్పకుండా దక్కించుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్నారని సమాచారం.

ఇదిలా ఉండగా, వర్సిటీకి చెందిన దాదాపు 10 ఎకరాల భూమిని పోలీసుశాఖ వాడుకుంటోందని లెక్కలు తీశారు. దీని విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వర్సిటీలో పోలీసుశాఖకు కేటాయించిన ఆయా భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటేనే భవిష్యత్తు తరాలకు వర్సిటీ సేవలందిస్తుందని చెబుతున్నారు.


రిజిస్ట్రార్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎంఎస్ఎఫ్ నేతలు

కాగా, వర్సిటీ ఉద్యోగ. మేధావి, విద్యార్థివర్గాలన్నీ ఏకమై జేఏసీగా ఏర్పడి వర్సిటీ భూముల రక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలనే నిర్ణయానికి వస్తున్నట్లు తెలిసింది. అయితే పోలీసు అధికారులు మాత్రం తమకే భూమి దక్కుతుందనే భరోసాతో ఉన్నారని తెలుస్తోంది.

ఎన్ఎస్ఎస్ విభాగానికి ఇవ్వాలి..

కేయూ చెందిన సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు ఇచ్చిన భూమిని వర్సిటీలోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగానికి ఇవ్వాలని ఎంఎస్ఎఫ్ నేతలు శనివారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని అందచేసి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌ను తన చాంబర్‌లో కలిసి వర్సిటీ ఎన్ఎస్ఎస్‌కు సరైన సదుపాయాలు లేవని, ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, జిల్లా నాయకులు మంద భాస్కర్, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, అజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అధికారుల బృందం తనిఖీలు

మాజీ వర్సిటీ ఉన్నతాధికారుల ఫిర్యాదులపై ఆరా

కేయూక్యాంపస్, ఆగస్టు 31: కాకతీయ యూనివర్సిటీలో శనివారం విజిలెన్స్ రెవెన్యూ మున్సిపల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. 5 శాఖల ఉన్నతాధికారుల ప్రత్యేక బృందంగా ఏర్పడి వర్సిటీలో కలియతిరిగి వర్సిటీ మాజీ ఉన్నతాధికారులపై వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. వర్సిటీలోని భూములన్నీ స్వయంగా తిరిగి పరిశీలించారు. వర్సిటీ భూముల సర్వే నెంబర్లలో ఉన్న భూమి ఎంత? ఎంత అన్యాక్రాంతమైందనే విషయంపై పరిశీలన చేశారు. వర్సిటీ భూముల హద్దులను పరిశీలించారు. భూమి ఆక్రమణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్సిటీ మాజీ ఉన్నతాధికారుల పాత్రను ప్రత్యేకంగా నోట్ చేసుకున్నారు. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారు తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, ఇతరులకు లబ్ధి చేకూర్చే అంశాలన్నీ ప్రస్తావించారు. తాజా మాజీ వర్సిటీ బాస్‌తో పాటు ఆయన హయాంలో పనిచేసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ బృందంలో ఇద్దరు జిల్లా విజిలెన్స్ అధికారులు, ఇద్దరు మునిసిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ నుంచి ఒక్కరు, తహసీల్దార్‌తో పాటు వర్సిటీ బిల్డింగ్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 31 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఈదులపూసపల్లిలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన కుమార్ (45) వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 4న ఈదులపూసపల్లిలో మహబూబాబాద్-కేసముద్రం రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో కేసముద్రం మండలం పెనుగొండ శివారు నర్సింహులగూడెంకు చెందిన ద్విచక్రవాహనదారుడు ఆదిత్య వేగంగా వచ్చి ఎదురుగా కుమార్‌ను ఢీకొట్టాడు. ఈఘటనలో కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఓ ప్రైవేట్ వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్ భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాలు రద్దు'

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 31 : భారీ వర్షాల కారణంగా ఆలింకో సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాలు గంగారం, మరిపెడ, మహబూబాబాద్‌లో నిర్వహించాల్సిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారిణి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక శిబిరాల కొత్త తేదీలను పత్రిక ప్రకటన ద్వారా త్వరలో తెలియజేస్తామని, ఈ విషయాన్ని దివ్యాంగులు గమనించాలని కోరారు.

ఎక్కడి పనులు అక్కడే.!

- గోపాలగిరి ఆయిల్‌పామ్ పరిశ్రమ పూర్తెప్పుడో?
- జిల్లాలో ఏటేటా పెరుగుతున్న పంట సాగు
- తొర్రూరులో గత ప్రభుత్వం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రగతిపై దృష్టి సారించాలంటున్న ప్రజలు


గోపాలగిరిలో ఆయిల్‌పామ్ పరిశ్రమ నెలకొల్పే స్థలం ఇదే

తొర్రూరు రూరల్, ఆగస్టు 31 : పాలకుర్తి నియోజకవర్గానికి కేంద్రంగా ఉంటున్న.. తొర్రూరు మండలంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగ లేదు. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల మధ్య ఉన్నా తొర్రూరు రవాణా పరంగా ఎంతో సౌకర్యం ఉన్నా, వాణిజ్య పరంగా వెనుకబడిపోతోంది. ఇక్కడికి పరిశ్రమలు వస్తే ప్రగతిపథంలో నడుస్తుందని ఆశిస్తున్న ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2023 ఎన్నికలు సమీపిస్తుండటంతో తొర్రూరు మండలంలో కోట్లాది రూపాయల పనులకు హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమని ఆశించిన ప్రజలు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. తొర్రూరు మండలంలో ముఖ్యంగా వందపడకల ఆస్పత్రి, గోపాలగిరి గ్రామంలో ఆయిల్‌పామ్ పరిశ్రమ, డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ, రహదారులు వంటి పనులపై దృష్టి సారించాల్సి ఉన్నా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరిశ్రమ పనుల ప్రారంభమెప్పుడో?

జిల్లాలో ఆయిల్‌పామ్ తోటలను విస్తారంగా పెంచి రైతులకు అండగా ఉండటం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెప్టెంబరు 2023న తొర్రూరు మండలం గోపాలగిరి గ్రామంలో 111 సర్వే నంబర్‌లో 45 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్ల నిధులతో పరిశ్రమను ఏర్పాటు చేసి, రైతులకు అందుబాటులోకి తీసుకు రావడం కోసం పరిశ్రమకు శంకుస్థాపన చేసింది. పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగానే విక్రయాలు జరుపుకునే అవకాశం ఉండటంతో జిల్లాలో 2020-21 నుంచి 2023-24 వరకు వెయ్యి మంది రైతులకు పైగా 6,841 ఎకరాల సాగు కొనసాగతుండగా ఈసారి మరో 4వేల ఎకరాలు సాగు పెరుగనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ఇప్పటికే పరిశ్రమ ప్రహరీ కోసం టెండర్లు పిలువగా పనులు ప్రారం భించిన దాఖలాలు లేదు. రహదారినిర్మాణ పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మూడేళ్ల తరువాత దిగుబడి ప్రారంభమై రైతులకు నిత్యం పంటచేతికి వస్తోంది. ఇప్పటికే తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన రైతు, కురవి, నెల్లికుదురు, మండలాలకు చెందిన కొంత మంది రైతులు పంట కోత దశకు రావడంతో ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించుకుంటు న్నారు.

పరిశ్రమ ప్రారంభమైతే మూడు షిఫ్టులు పరిశ్రమ నడువడంతో సుమారు 1000 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. పంట దిగుబడి మరో సంవత్సరకాలంలో రానుంది. అయితే 2025-26 నాటికి అందుబాటులోకి తీసుకువస్తే రైతులు ఇక్కడే పంటను విక్రయించుకునే అవకాశం ఉంది. ఆయిల్‌పామ్ పరిశ్రమకు సంబంధించిన యంత్రాలన్నీ ఇతర దేశాల నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. ఇప్పటికీ టెండర్ ప్రక్రియ ప్రారం భించకపోవడం, ఇప్పుడు పనులు ప్రారంభించినా పూర్తయ్యే సమయానికి మూడేళ్లు పట్టేఅవకాశం ఉంది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఉండటం.. పరిశ్రమ నిర్మాణం పై వేగం పెంచకుండా స్తబ్దతగా ప్రజాప్రతినిధులు ఉండటం.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిశ్రమ పూర్తి అవుతదా? నిలిచి పోతదా! అనే అపోహలో రైతులు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశ్రమ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పరిశ్రమ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పరిశ్రమ నిర్మాణంలో ఎలాంటి చర్యలు లేవు

తూర్పాటి చిన్న అంజయ్య ఆయిల్‌పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ



గత ప్రభుత్వం ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం పనులు ప్రారంభించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమ నిర్మాణం కోసం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. 2025-26 సంవత్సరానికి రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా టెండర్లు కూడా పిలవలేదు. మరో రెండు సంవత్సరాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికంగా పంట చేతికి రానుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని పనులు ప్రారంభించాలి.

2029 నాటికి రైతులకు అందుబాటులోకి తెస్తాం..

రాములు, ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్, మహబూబాబాద్

గోపాలగిరి గ్రామంలో నిర్మించే ఆయిల్‌పామ్ పరిశ్రమను 2029 నాటికి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రస్తుతానికి పంట దిగుబడి అధికంగా లేదు. ఇప్పటికే పరిశ్రమ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇతర దేశాల నుంచి మిషనరీలు తీసుకురావాల్సి ఉంది. యంత్రాలు తీసుకువస్తే మూడు షిఫ్టులు నడువాల్సి ఉంటుంది. అందుకు అనుకూలంగా పంట వచ్చే సరికి పూర్తి చేస్తాం.

లైన్ షిఫ్టింగ్‌కు లంచం

- ఏసీబీకి చిక్కిన స్టేషన్‌ఘన్‌పూర్ విద్యుత్ డీఈఈ
- రైతు దగ్గర నుంచి రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టివేత

స్టేషన్‌ఘన్‌పూర్ (జనగామ జిల్లా), ఆగస్టు 31 : 33/11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టు చేసేందుకు ఎల్‌సీ ఇవ్వడానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎన్పీడీసీఎల్ డీఈఈ హుస్సేన్‌నాయక్ రైతు కుంభం రాజు అనే రైతువద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన రైతు కుంభం ఎల్లయ్యకు ఘన్‌పూర్ మోడల్ కాలనీ శివారులో ఉన్న వ్యవసాయ పొలం మధ్యగా 33/11 కేవీ విద్యుత్‌లైన్ ఉంది. దీంతో పంటలను సాగు చేయడానికి ఇబ్బందులు పడుతున్నాడు. తన పంటచేనులోనే ఉన్న సుమారు 800 మీటర్ల పొడవు ఉన్న విద్యుత్‌లైన్‌ను ఓ పక్కకు షిఫ్టు చేయాలని మూడు నెలల కిందట విద్యుత్ అధికారులను సంప్రదించాడు. లైన్ షిఫ్టు చేయడానికి రూ.16లక్షలతో సబ్ ఇంజనీర్, ఏడీఏలు ఎస్టిమేషన్ తయారుచేసి ఇచ్చారు. ఈ మేరకు ఎల్లయ్య కుమారుడు రాజు రూ.16 లక్షల డీడీ కట్టి అధికారులకు ఇవ్వగా, ప్రైవేట్ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. విద్యుత్ టవర్‌లను ఏర్పాటు చేశాడు. అయితే విద్యుత్ లైన్లు లాగడానికి ఎల్‌సీ కోసం సైతం రూ.2 లక్షలు చార్జీలు చెల్లించాడు. డీఈఈ సంప్రదించి ఎల్‌సీ తీసుకోవాలని కాంట్రాక్టర్ రైతుకు తెలిపారు. దీంతో ఈనెల 28న బాధితుడు కుంభం రాజు డీఈఈని ఆయన కార్యా లయంలో కలిసి ఎల్‌సీ ఇవ్వాలని కోరాడు. రూ.50వేలు లంచం అడుగగా అంత ఇవ్వలేనని రూ.20వేలు ఇస్తానని చెప్పాడు. మూడునెలలుగా విసిగిపోయిన బాధిత రైతు.. వరంగల్ ఏసీబీని ఆశ్రయించాడు. పథకం ప్రకారం శనివారం సాయంత్రం డీఈఈకి ఫోన్ చేసి ఈ రోజు డబ్బులు ఇస్తానని చెప్పాడు. రాత్రి 8గంటల సమయంలో డబ్బులు పట్టుకొని డీఈఈ కార్యాలయానికి వెళ్లి రూ.20 వేలు డీఈఈకి అందిస్తున్న క్రమంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తెలి పారు. నిందితుడిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఇందులో సీఐలు సట్ల రాజుగౌడ్, శ్యాంసుందర్, ఎల్.రాజు పాల్గొన్నారు.


ఏసీబీకి పట్టుబడిన విద్యుత్ డీఈఈ హుస్సేన్‌నాయక్

పెద్దవంగర ఎస్సైగా బాధ్యతలను స్వీకరించిన క్రాంతికిరణ్



పెద్దవంగర, ఆగస్టు 31 : మండల ఎస్సైగా కె.క్రాంతికిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా పెద్దవంగర ఎస్సైగా పని చేసిన జి.ఉపేందర్ తొర్రూరు బదిలీ కాగా, ఆయన స్థానంలో జిల్లా కేంద్రంలో వీఆర్‌లో ఉన్న క్రాంతికిరణ్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దవంగర ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగివాహనం నడిపేతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక


వెంకన్న కార్యదర్శి సదానందం అధ్యక్షుడు

మహబూబాబాద్‌ఎడ్యుకేషన్, ఆగస్టు 31: జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు ధర్మేంద్ర, జీజేఎల్‌ఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా పొక్కుల సదానందం, ప్రధాన కార్యదర్శిగా బానోత్ వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఉపాధ్యక్షుడిగా రాగం పరశరాములు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా అజీజ్‌బేగ్ మిర్జా, మహిళ కార్యదర్శిగా రాజకుమారిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సదానందం మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడతామని తెలిపారు. తమఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి మదార్, నాయకులు బాబురావు, వీరస్వామి, మధు, ఠాగూర్ శ్రీధర్‌సింగ్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన


(3వ పేజీ తరువాయి)

గుండ్లకుంట వద్ద రెండు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో వాహనరాకపోకలకు అంతరాయం కలిగింది. మరిపెడ మండలంలోని మిర్చితోటలు, వరి చేలలో భారీగా వరదనీరు చేరింది. దంతాలపల్లి మండలంలో పాలేరువాగు పొంగి ప్రవహిస్తోంది. దంతాలపల్లి సమీపంలో రోడ్డుపై చెట్లు కూలడంతో పోలీసులు జేసీబీని తెప్పించి చెట్లను తొలగించారు. నర్సింహులపేట మండలంలోని కౌసల్యదేవిపల్లి వద్ద చెక్‌డ్యాంలు అన్నిమత్తడిపోస్తున్నాయి. జిల్లాలోని వివిధ గ్రామాల్లో వర్షం కురుస్తోంది.

899.0 మి.మీ వర్షపాతం నమోదు

మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 899.0 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 56.2 మిల్లిమీటర్ల వర్షపాతం కురిసింది. కొత్తగూడలో 88.6 మీ.మి, గంగారంలో 72.6, బయ్యారంలో 66.0, గార్లలో 68.2, డోర్నకల్‌లో 89.4, కురవిలో 65.4, మహబూబాబాద్‌లో 77.6, గూడూరులో 72.0, కేసముద్రంలో 32.4, నెల్లికుదురులో 41.2, నర్సింహులపేటలో 53.4, చిన్నగూడూరులో 49.2, మరిపెడలో 72.6, దంతాలపల్లిలో 20.4, తొర్రూరులో 18.6, పెద్దవంగరలో 11.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి పొద్దుపోయే వరకు పలుమండలాల్లో వర్షం కురుస్తూనే ఉంది.

ఉప్పొంగిన భీమునిపాదం



గూడూరు, ఆగస్టు 31 : ఎత్తైన గుట్టలు, ఆరుదైన వృక్షాలు, అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం ఉప్పొంగుతోంది. గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం 70 ఫీట్ల ఎత్తు నుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి భీమునిపాదంకు వరద తాకిడి పెరిగింది. పచ్చని ప్రకృతి మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్‌ఫాల్స్‌లో తడుస్తూ, కేరింతులు కొడుతూ పర్యాటకులు ఆనందంగా గడుపుతున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పర్యాటకులు భీమునిపాదంను సందర్శిస్తున్నారు. భీమునిపాదంవద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, అటవీశాఖ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

'రైతులకు మెరుగైన సేవలందించమే లక్ష్యం'

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 31 : వ్యవసాయ మార్కెట్లలో రైతులకు మెరుగైన సేవలందించమే తమ ముందున్న లక్ష్యమని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏనుమాముల, జనగామ, జమ్మికుంట, మహబూబాబాద్, ఖమ్మం మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులు ఏనుమాముల మార్కెట్‌లోని పలు సమస్యలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మార్కెటింగ్‌శాఖలో ముఖ్యంగా మార్కెట్లలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉన్న అధికారులు, సిబ్బందితో ప్రస్తుతం ఉన్న సాంకేతికతను జోడించి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏనుమాముల మార్కెట్‌లో ఉన్న వేబ్రిడ్జిలను మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. లక్ష్మీపురం, మార్కెట్‌తో పాటు ఏనుమాముల మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మార్కెట్‌లో దడువాయిలు వాడే పీవోఎస్ మిషన్లు కొత్తవి కొనుగోలు చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తామన్నారు.

'రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతుల ఆందోళన'


నర్సింహులపేట అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

నర్సింహులపేట, ఆగస్టు31 : రైతుల రుణాల మాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు జి.మోహన్ ఆరోపించారు. రైతుల రుణమాఫీలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ శనివారం సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో పలువురు రైతులు ఆందోళన చేసి, ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో రూ. 2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీచేస్తామన్నా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక ఆంక్షలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షలు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నర్సింహులపేట పీఏసీఎస్ బ్యాంకు పరిధిలో రుణాలు తీసుకున్న రైతులకు అర్హత ఉన్నప్పటికీ రుణాలు మాఫీ కాలేదని, బ్యాంకు అధికారుల తప్పిదాలతో వందలాది మంది రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మందుల యాకూబ్, అంది మధు, పూర్ణచందర్, జానీ, మోతిలాల్, కల్యాణ్, భద్రు, రైతులు పాల్గొన్నారు.

1700 మంది ఖాతాల్లో 534 మందికి లబ్ధి..

● చిన్నగూడూరు : రైతులకు రుణవిముక్తి కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడువిడుతల్లో రూ.2లక్షలలోపు రైతులకు రుణమాఫీ నిధులు విడుదల చేసింది. అయితే రుణమాఫీ చిక్కులతో కొందరు రైతులు అల్లాడిపోతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జయ్యారం ఇండియన్ బ్యాంకులో మూడువిడుతల రుణమాఫీ జాబితాల్లో తమపేర్లు లేకపోవడంతో శనివారం ఇండియన్ బ్యాంక్‌లో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బ్యాంక్‌లో 1700 మంది రైతులు రుణాలు తీసుకుంటే 534 మందికి మాఫీ అయ్యాయన్నారు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని వ్యవసాయ, బ్యాంకు అధికారుల చూట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటి వరకు ఇంటింటి సర్వే లేదు, మాఫీలేదని 11 వందల మంది రైతులు మాఫీ కోసం ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు స్పందించి రైతులందరికీ రుణమాఫీ చేయాలని గండిబాబు, రాములు, సాయిబాబు, గోవర్దన్, రామనాథం, భిక్షపతి, లింగయ్య అధికారులను కోరారు. కాగా, జయ్యారం ఇండియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపామని, నిధులు విడుదల చేస్తే అర్హులైన రైతులందరికీ మాఫీ డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

రుణమాఫీపై రైతులు ఆందోళన చెందొద్దు

- జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ నిర్మల

గార్ల ఆగస్టు 31 : మండలంలో రూ.2 లక్షల రుణమాఫీ అర్హత సాధించలేని రైతులు ఆందోళన చెందనవసం లేదని జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల అన్నారు. శనివారం గార్ల రైతు వేదిక మందిరంలో రుణమాఫీపై మార్గదర్శకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు రేషన్ కార్డులేని రైతులు ఫ్యామిలీ గ్రూపింగ్ చెక్ చేసుకోవాలని సూచించారు. మండలంలో 354 మంది రైతులకు రేషన్ కార్డులులేవని, అందుకే మ్యాచింగ్ కాకపోవడంతో వీరికి రుణమాఫీ కాలేదన్నారు. ప్రతీ రైతుకు రుణమాఫీని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రైతులు ఆందోళన చెంద వద్దన్నారు. ఈ సమావేశంలో ఏడీఏ ఎ.శ్రీనివాస్, ఏవో కావటి రామారావు పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ కార్యక్రమం పరిశీలన..

● బయ్యారం : మండలంలో రుణమాఫీ అమలు కాని రైతుల కుటుంబ నిర్ధారణలో భాగంగా యాప్‌లో సెల్ఫీ తీసుకునే కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాస్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి మరియన్న పరిశీలించారు. రుణమాఫీ అమలు కాని రైతులతో జిల్లా అధికారులు ముఖాముఖి మాట్లాడారు. రుణమాఫీ అమలు కాని రైతుల జాబితా ఆధారంగా ఆయా గ్రామాల్లో ముందస్తుగా సమాచారం అందించి, వారి కుటుంబంతో సెల్ఫీని అప్‌లోడ్ చేయాలని డీఏవో సూచించారు. కార్యక్రమంలో ఏవో బానోత్ రాంజి, తేజస్వి, రచన, నాగరాజు పాల్గొన్నారు.

'నేటి పెన్షన్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలి'

తొర్రూరు/తొర్రూరు రూరల్, ఆగస్టు31 : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈ) జాక్టో జిల్లా చైర్మన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం హరిపిరాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాష్ట్రప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పాత పెన్షన్ విధానం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా జనరల్ సెక్రెటరీ యాకూబ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తండాల చంద్రప్రకాశ్‌గౌడ్, రాజుగౌడ్, యాకయ్య, దాసరి చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడాలి : సీఐ

డోర్నకల్, ఆగస్టు 31 : మతసామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సీఐ రాజేష్ అన్నారు. డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకరి మత విశ్వాసాలను మరోకరు గౌరవించాలన్నారు. సమాజంలో అందరు సమానమేనని, ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలగాలని సూచించారు. సమావేశంలో సుల్తాన్, రమేష్‌లడ్డా, రమాకాంత్, సంజయ్, వెంకటేష్, సలీంపాషా, ఖాదర్‌బాబా, మున్నా, రజాలీ, రఫీ, అలీముద్దీన్, లక్ష్మయ్య, ఎస్సై వంశీధర్ పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

బయ్యారం, ఆగస్టు 31 : వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ రవికుమార్ కోరారు. బయ్యారంలో శనివారం వివిధ మతాల పెద్దలతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ మండపాలను ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని కోరారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అన్ని మతాల వారు సహకరించాలని కోరారు. ఎస్ఐ కోగిల తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల పాఠశాలల తనిఖీ

మరిపెడ, ఆగస్టు 31 : మరిపెడలోని ఎస్సీ బాలుర, బాలికల గురుకుల స్కూల్స్, కళాశాలను శనివారం మండల రాపిడ్ రెస్పాన్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గురుకులాలలోని వంటలను పరిశీలించారు. మెనూ అమలు తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌రూమ్, డార్మెంటరీ, వాటర్‌ప్లాంట్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి, ఎంపీడీవో విజయ, మెడికల్ ఆఫీసర్ రవి, ఎంపీవో సోమ్లానాయక్, మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఆయా గురుకుల ప్రిన్సిపాల్స్ దయాకర్, సునీత పాల్గొన్నారు.

'జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలి'

మరిపెడ, ఆగస్టు 31 : జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీ జిల్లాగా ప్రకటించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మరిపెడ మునిసిపల్‌లోని కనుకదుర్గ మినీ ఫంక్షన్‌హాల్‌లో ఆ పార్టీ పట్టణ, మండలస్థాయి సమావేశం జరుగగా వీరన్న పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో దుండి వీరన్న, నందిపాటి వెంకన్న, బాణాల రాజన్న, మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పలయ్య, షరీఫ్, దుర్గయ్య, రాజశేఖర్, ఎర్ర వెంకన్న, సోమయ్య, నరేశ్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

కురవి, ఆగస్టు 31 : మండలంలోని నేరడలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని డీఈవో వి.రాజేశ్వర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంటగది, స్టాక్ రిజిస్టర్, సిక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. విధుల్లో ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో జి.వి జయ్‌కుమార్, ఏసీజీ శ్రీరాములు, ఎస్‌వో సరస్వతి పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి

- కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 31 : సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నారాయణ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలను నారాయణ శనివారం సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 30లోగా కళాశాలల్లో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై. కృష్ణప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాల్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కె.బి.శంకర్, పారామెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు31 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి మదార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానుకోటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడం వలన విద్యార్థులు భయాందోళనకు గురువుతున్నారని తెలిపారు. వర్షం వచ్చినప్పుడు భవనంపై నుంచి నీరు తరగతి గదుల్లోకి వస్తుందని పేర్కొన్నారు. స్థానిక శాసన సభ్యుడు స్పందించి వారి ప్రత్యేక నిధుల నుంచి కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, చందు, రాకేష్, వికాస్ పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలి

- ఎంపీ పోరిక బలరాంనాయక్


హైదరాబాద్‌లో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి వీఎస్ అలుగు వర్షిణితో చర్చిస్తున్న ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీ పోరిక బలరాంనాయక్ కోరారు. హైదరాబాద్‌లో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి అలుగు వర్షిణి, అడిషనల్ డైరెక్టర్ హనుమంతునాయక్‌ను శనివారం స్థానిక ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సీట్లు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై చర్చించారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కేసముద్రం, ఆగస్టు 31 : మండలంలోని సబ్‌స్టేషన్‌తండా సురేష్‌నగర్ కాలనీలో శనివారం బానోత్ హున్యా (70) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు అదే తండాకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు బాదావత్ పవన్‌కల్యాణ్ రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హున్యా కుటుంబ సభ్యులకు అంత్యక్రియలు నిర్వహించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో విషయం తెలుసుకుని వెంటనే సహాయాన్ని పంపించినట్లు పవన్‌కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ పృథ్విరాజ్, బానోత్ వీరన్న, ఉబ్బపల్లి కృష్ణ, భూక్య వీరు, వాంకుడోత్ చక్రు, బాదావత్ స్వామి, గుగులోత్ పార్వతి పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనను పెంపొందించాలి

- జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్

కేసముద్రం, ఆగస్టు 31 : సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలి శాస్త్రీయ ఆలోచనను పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్ అన్నారు. కేసముద్రంలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మహబూబాబాద్ ఐఎంఏ హాల్‌లో సెప్టెంబర్ 1న నిర్వహించే జేవీవీ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు జిల్లా ఉన్నతాధికారులు, మేధావులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు హాజరవుతున్నారని, శాస్త్రీయ ఆలోచనలు పెంపొందింపజేసేందుకు ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల నిర్మాణానికి సహకరించాలి

- ఆర్‌డీవో నర్సింహారావు

చిన్నగూడూరు, ఆగస్టు 31 : విద్యార్థుల భవిష్యత్, సమస్యల దృష్ట్యా నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ పాఠశాల నిర్మాణానికి సహకరించాలని ఆర్‌డీవో నర్సింహారావు అన్నారు. శనివారం చిన్నగూడూరులో నిర్మాణ పనులు చేపట్టి కొంత కాలంగా ఆగిపోయిన పాఠశాల, వసతిగృహ నిర్మాణ పనులు కొనసాగించుటకు సంబంధిత అధికారులులతో కలిసి ఆయన నూతన భవనంను సందర్శించి, కోర్టులో స్టేవేసిన రైతుతో మాట్లాడి అతని భూమి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంఎంవో శ్రీరాములు, డీఈవో రాజేశ్వర్, జీసీడీవో విజయకుమారి లలిత ఉన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 31 : జిల్లాలోని మైనార్టీ గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ విద్యాసంవత్సరం ఆరంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికి నేటికి మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న అధ్యాపక ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీచేసి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలోసీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబోతు అశోక్, జొనికెన రమేష్ పాల్గొన్నారు.